క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తాం



స్కానింగ్ సెంటర్ తనిఖీలో డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తామని డీఐఓ రవిరాజు హెచ్చరించారు. చిత్తూరు నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధిగా నిర్ణీత సమయంలో రెన్యూవల్ చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ లేకుండా స్కానింగ్‌లు చేస్తే కేసులు నమోదుచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



దళవాయిపల్లెలో సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థులు

యాదమరి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో, పాఠశాల వార్షికోత్సవాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని దళవాయిపల్లె ప్రాథమికోన్నత పాఠశాల, వరిగపల్లె ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉదయం వార్షికోత్సవం ఉదయం సరస్వతి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ రుక్మిణీ మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. దీనిపై గ్రామాలలో బడి ఈడు పిల్లలు అందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరాలని కోరారు. చివరగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పంచాయతీకి రూ 15.31 లక్షల ఆదాయం

బంగారుపాళెం: వారపు సంత వేలం ద్వారా బంగారుపాళెం మేజర్ గ్రామ పంచాయతీకి రూ.15.31 లక్షలు ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ ఉమాదేవి, ఈఓ శంకరయ్య తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం 2024–25 సంవత్సరానికి గాను దినసరి, వారపుసంత బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు చెప్పారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ.3.81లక్షలు పంచాయతీకి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కామరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచార బహిరంగ సభ

ఐరాల: మండల కేంద్రంలోని పాతపాళ్యం ఓంశక్తి ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఆదివారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, మండల పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్నికల ప్రచార సభకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరుకానున్నట్లు వెల్లడించారు. మండలంలోని ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యురాలు, కో–ఆప్షన్ మెంబర్, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగ నాయకులు, మహిళలు, యువత, కార్యకర్తలు, అభిమానులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఘనంగా అమరజీవి జయంతి వేడుకలు

చిత్తూరు రూరల్: నగరంలోని గంగినేని పార్కులో వాసవీ క్లబ్ గ్రేటర్ వారి ఆధ్వర్యంలో అమరజీవికి ఘన నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పార్కులో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఆరూరు రామమూర్తి, గోవర్ధన్, చంద్రశేఖర్, శ్రీధర్‌రావు, శ్రీవప్రసాద్ లక్ష్మణ, చంద్రశేఖర్, సునీల్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. అమరజీవి విగ్రహ స్థాపన కమిటీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, అరుణ, శ్రీహరి, అమర్‌నాథ్, సహదేవనాయుడు, రమేష్‌బాబు, ప్రాత్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు ఆయన చేసిన మేలును వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పొట్టి శ్రీరాములు విగ్రహస్థాపన కమిటీ సభ్యులు

ఓ సైనికుడిగా బరిలోకి..



చిత్తూరు అర్బన్: పార్టీ కోసం కష్టపడి పనిచేసే సామాన్య కార్యకర్తలకు ఇచ్చే స్థానమేంటంటే ఈ రోజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారు. పార్టీ ఆవిర్భావం రోజు నుంచి ఇప్పటి వరకు ఓ సామాన్య కార్యకర్తగా పార్టీ కోసం పనిచేశాను. నేను చేస్తున్న పనిని గుర్తించి ఇపుడు చిత్తూరు అభ్యర్థిగా ప్రకటించడం సంతోషంగా ఉంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు సీఎంగా గెలిపించుకోవడానికి ఓ సైనికుడిగా బరిలోకి దిగుతున్నాను. ప్రజల కోసం ఆయన చేసిన సంక్షేమ కార్యక్రమాలే నన్ను గెలిపిస్తాయని బలంగా నమ్ముతున్నాను. జగనన్న సైనికుడిని ఢీకొట్టడానికి ఇక్కడ మూడు కాదు.. 30 పార్టీలు ఒక్కటైనా వాళ్ల బలం చాలదు. తొలిసారిగా రాజకీయాల్లోకి అడుగుపెడుతున్న నాకు చిత్తూరు ప్రజల ఆశీస్సులు కావాలని కోరుతున్నాను.

– ఎంసీ.విజయానందరెడ్డి, చిత్తూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

అందుబాటులో ఉంటా



యాదమరి: పూతలపట్టు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా. గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తాను. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. గ్రామాల్లోని పార్టీ నాయకులతో కలసి పని చేస్తాను. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను ఎంపిక చేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాను. 2014 ఎన్నికల్లోనూ జగనన్న అండదండలతోనే గెలిచాను. ఈ సారి మళ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. జగనన్నను సీఎంగా గెలిపించుకోవడానికి నా వంతు ప్రయత్నం చేస్తాను. ప్రజలందరూ ఫ్యాను గుర్తుపై ఓటేయాలి.

–డాక్టర్ సునీల్‌కుమార్, పూతలపట్టు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

విజయానందరెడ్డి అభ్యర్థిత్వంపై సంబరాలు

- గజమాలతో సత్కరించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- అమరజీవికి నివాళులర్పించిన పార్టీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయానందరెడ్డి(వీఎన్ఆర్)ని ప్రకటించారు. దీంతో శనివారం నగరంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. అనంతరం విజయానందరెడ్డి 37వ డివిజన్‌లో పర్యటించారు. అంగరంగ వైభవంగా పార్టీ నాయకులు ఆయనకు ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద గజమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం వీరాంజనేయస్వామి ఆలయం, మసీదులో పూజలు, ప్రార్థనలు చేశారు. అడుగడుగున పువ్వుల వర్షం కురిపిస్తూ, టపాకాయలు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి నాయకులు కన్నన్, దీపక్, మండీసుధ, శివ, ప్రసన్న, వీఎస్ఎం సాయి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలో పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను విజయానందరెడ్డి శనివారం పార్టీ కార్యాలయం, పలు ప్రాంతాల్లో అందజేశారు. సహదకు రూ.60 వేలు, సతీష్‌బాబుకు రూ.3 లక్షలు, పవనమ్మకు రూ.55,000, భానుచందర్‌కు రూ.80వేలు, షేక్ అబ్దుల్ జహుర్‌కు రూ.65,000, సుబ్రమణ్యంకు రూ.2 లక్షల చొప్పున బాధితులకు అందజేశారు.



పాతబస్టాండ్ సమీపంలో పర్యటిస్తున్న విజయానందరెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న వీఎన్ఆర్

పొట్టి శ్రీరాములుకు నివాళి

పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని స్థానిక గంగినేనిపార్కులో ఆయన విగ్రహానికి విజయానందరెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర ఆవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోషణ్ పక్వాడ వారోత్సవంలో సూపర్‌వైజర్

గుడిపాల: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత అన్నారు. మండలంలోని తిమ్మాపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడ వారోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన పౌష్టికాహారం ప్రతి తల్లీబిడ్డకు అందాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలన్నారు. జంక్ ఫుడ్ పట్ల ఆకర్షితులైన యువత ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటుందని, బజారులో దొరికే ఆహారానికి దూరంగా ఉండాలని చెప్పారు. పౌష్టికాహార ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసమే ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్ల ద్వారా పౌష్టికాహారం వలన కలిగే లాభాల గురించి అందరికీ అర్థమయ్యే రీతిలో చెబుతున్నామన్నారు. మాంసాహారం వద్దు–శాకాహారం ముద్దు అన్న నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం వైఎస్సార్ పోషణ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నిషా, సిబ్బంది వాసంతి, రోష్‌లీ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

'అదాలత్'తో పెండింగ్ కేసుల పరిష్కారం



రివార్డు అందిస్తున్న న్యాయమూర్తులు

చిత్తూరు అర్బన్: న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఉత్తమమైన మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు తెలిపారు. శనివారం చిత్తూరులోని కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ అదాలత్‌లో ఒక్కసారి రాజీ చేసుకుంటే దీనిపై అప్పీల్‌కు వెళ్లేందుకు కూడా వీలుండదని వెల్లడించారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని స్పష్టం చేశారు. అనంతరం కేసులు పరిష్కరించుకున్న కక్షిదారులకు రివార్డులు అం దజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు కరుణకుమార్, వెన్నెల, కీర్తన, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో వైఎస్సార్‌సీపీ నాయకులు

ఐరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల సొంతింటి కల సాకారమైందని వైఎస్సార్‌సీపీ నేత ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎం.పైపల్లె సచివాలయ పరిధిలోని 18 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలను శనివారం ఎసచివాలయ ఆవరణలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పేదల సొంతిల్లు లేక అద్దె ఇళ్లు, గుడిసెల్లో అవస్థలు పడ్డారని, అలాంటి వారి కలను జగనన్న సాకారం చేశారని కొనియాడారు. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన మహిళలంతా జగనన్నకు మద్దతుగా నిలిచి మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఆయన కోరారు.

వలంటీర్లు సంక్షేమ రథ సారథులు

వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ రథ సారథులని ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎం.పైపల్లె సచివాలయంలో 9 మంది వలంటీర్లను ఆయన సన్మానించారు. వలంటీర్లు పారదర్శకంగా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం వారిని సత్కరించి, నగదు పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ జయచంద్ర, నేతలు మునస్వామిరెడ్డి, ఆదినారయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రమీల పాల్గొన్నారు.

గ్రామీణులకు వరం ఫ్యామిలీ డాక్టర్



తవణంపల్లె: వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్



ఐరాల: వృద్ధురాలికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గ్రామీణ పేదలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని కట్టకిందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజలకు వైద్యసేవలు

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజలకు అందుబాటులో వైద్య సేవలందిస్తున్నామని వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఈచనేరితో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 43 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గర్భవతులు, బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. వైద్య సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలపై పోస్టర్ ఆవిష్కరణ

చిత్తూరు కలెక్టరేట్: గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి పోస్టర్‌ను జిల్లా ప్రభుత్వ ఖాజీ కమలుల్లా జహూరి శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరుకు సమీపంలో మురకంబట్టు వద్ద ఉన్న మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో మెరుగైన వసతులున్నాయన్నారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి ప్రస్తుతం 200 బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో మరో 300 మంది మైనారిటీ బాలికలు ఉచితంగా అడ్మిషన్ పొందవచ్చని సూచించారు.కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ గఫార్‌ఖాన్, కో–ఆపరేషన్ మెంబర్ ఆను, డివిజనల్ ఖాజీ నయిముల్లా జహూరి, అంజుమన్ కమిటీ అబ్దుల్ గని పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమలుల్లా జహూరి

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి



చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న కమిషనర్ అరుణ



తవణంపల్లెలో ఎన్నికల కోడ్‌పై సూచనలిస్తున్న తహసీల్దార్ అరుణకుమారి

చిత్తూరు అర్బన్: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో కార్పొరేషన్‌లోని అధికారులు, ఉద్యోగులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని ఏఆర్వో, మునిసిపల్ కమిషనర్ అరుణ ఆదేశించారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో శనివారం కార్పొరేషన్ అధికారులు, వార్డు కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వార్డు సచివాలయాల్లో ఎలాంటి రాజకీయపరమైన, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి చిత్రాలు, పోస్టర్లు ఉండొద్దన్నారు. అన్ని వార్డుల పరిధిలో పూర్తిస్థాయిలో రాజకీయపరమైన బ్యానర్లు, పోస్టర్లు, తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలని చెప్పారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల శిలాఫలకాలను మూసి ఉంచాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, మైదానాలు, బస్టాండ్లు, డివైడర్లు, ఇతర ప్రాంతాలు అన్నింటినీ పరిశీలించి ఎక్కడా ఎన్నికల నియమావళి ఉల్లంఘన లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వార్డుల్లో ఎక్కడా కొత్త పనులు చేయొద్దన్నారు. సిబ్బందిపై ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులు, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. మహిళా మార్ట్, కార్పొరేషన్ కార్యాలయంలోని బిల్లింగ్ కౌంటర్లను, అన్ని విభాగాలను పరిశీలించారు. నగదు చెల్లించే వారికి ఇచ్చే బిల్లుల్లో రాజకీయ పరమైన ఫోటోలు లేకుండా చూడాలని చెప్పారు. కార్యాలయంలోని సంక్షేమ పోస్టర్లను, ఇతర చిత్రపటాలను తీయించారు. ఆవరణలోని విగ్రహాలకు ముసుగు వేయించారు. అధికారులు, ఉద్యోగులకు మార్గనిర్దేశం చేశారు. మునిసిపల్ ఇంజినీరు గోమతి, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి, ఇన్చార్జి ఎంహెచ్వో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడ్ అమలుపై సమీక్ష

తవణంపల్లె: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు తమ విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఎన్నికల కోడ్ అమలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకొని బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడి రాజకీయ నాయకులు బోర్డులు, బ్యానర్లు, పోస్టర్లు ఉంచకుండా తక్షణమే తొలగించాలని సూచించారు. ఎన్నికల నియమావళిని పాటించని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సుధాకర్ రెడ్డి, భూ రీసర్వే డీటీ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

కష్టాలు తీర్చిన సచివాలయాలు



సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, జెడ్పీ వైస్‌చైర్మన్ ధనంజయ రెడ్డి

- నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

యాదమరి: సచివాలయాల సేవలతో ప్రజలకు కష్టాలు తీరాయని నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మోర్ధానపల్లె పంచాయతీ గ్రామ సచివాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. దీంతో ప్రజల వద్దకే పాలన వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు, ఎంపీటీసీ హేమలత, మోర్ధానపల్లె సర్పంచ్ మీనా మనోజ్ రెడ్డి, బుడితిరెడ్డి పల్లె సర్పంచ్ వాసురెడ్డి, మైనారిటీ కబీర్‌బాషా, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, వైస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

గుంపులుగా వచ్చినా గెలుపు జగనన్నదే

అన్ని పార్టీల నాయకులు గుంపులుగా వచ్చిన జగనన్నదే ఎన్నికలలో గెలుపు అని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేయడంతో ప్రజలు జగనన్న పక్షాన ఉన్నారని చెప్పారు. దీంతో చంద్రబాబుకు ఏం చేయాలో దిక్కుతోచక పొత్తుల కోసం పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అన్ని పార్టీలతో గుంపులుగా వచ్చినా, గెలుపు మాత్రం జగనన్నదేనని ధీమా వ్యక్తం చేశారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

ఐరాల: మండలంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓలు రుషీంద్రబాబు, దామోదర్‌నాయుడు తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన పదో తరగతి సెంటర్లను శనివారం వారు పరిశీలించారు. మౌళిక వసతులు, ఇతర ఏర్పాట్లపై ఆరా తీశారు. వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 375 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎం.పైపల్లె, కాణిపాకం జెడ్పీ హైస్కూల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆయా కేంద్రాలకు ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ ఉంటారని తెలిపారు. 27 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

పూతలపట్టు: మండలంలో సోమవారం నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. యం.బండపల్లి, పూతలపట్టు, పోలవరం, ఎర్రచెరువుపల్లి, పి.కొత్తకోట పరీక్ష కేంద్రాలను ఎంఈఓలు కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అత్యవసర వసతులపై ఆరా తీశారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు, అత్యవసర ప్రథమ చికిత్స, అందుబాటులో వైద్య సిబ్బంది వంటి వసతులు తప్పనసరిగా ఉండాలని సూపరింటెండెంట్లకు తెలియజేశారు. మండలంలో 548 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో లైట్లు, డెస్కులు తప్పనిసరిగా ఉండాలని, మరమ్మతులు ఉంటే ఆదివారంలోపు సరిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పూతలపట్టు: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓలు

టెన్త్ పరీక్షలకు 856 మంది

బంగారుపాళెం: మండలంలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు 856 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఎంఈఓ నాగేశ్వర్‌రావు శనివారం తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. మండలంలోని గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 107 మంది, బంగారుపాళెంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో 234, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 269, జూనియర్ కళాశాల కేంద్రంలో 246 విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామన్నారు.



ఐరాల: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రుషీంద్రబాబు